క్లుప్తంగా

విద్యార్థులకు బస్‌పాస్‌ల పంపిణీ

పాలకొల్లు సెంట్రల్: తమ విద్యా సంస్థ అభివృద్ధికి తోడ్పడాలనేదే లక్ష్యమని బీఆర్‌ఎంవీ మునిసిపల్ ఉన్నత పాఠశాల 1981 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు వట్టం గణేశ్వరరావు అన్నారు. ఈ పాఠశాలకు దూర ప్రాంతాల నుంచి వచ్చే 150 మంది విద్యార్థులకు మంగళవారం బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గణేశ్వరరావు మాట్లాడుతూ తమ బ్యాచ్ విద్యార్థుల తరుపున ఏటా ఆగస్టు 15న ప్రతి తరగతి నుంచి విద్యార్థులను దత్తత తీసుకుని విద్యాపరంగా ప్రోత్సమిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్ ఝాన్సీ లక్ష్మి, పీఎంసీ చైర్మన్ పెద్దిరాజు, కె.సాంబశివరావు, జి.శ్రీనివాస్, ఆర్‌వీఎస్ఎన్ రాజు, దాసా మహేష్, సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆర్‌టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక సీహెచ్ఆర్ అండ్ సీపీ ప్రాథమిక పాఠశాలలో ఆనందభైరవి అంబా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఫౌండేషన్ సభ్యుడు నిల్లా సురేష్ మాట్లాడుతూ ఏటా ఫౌండేషన్ తరుపున నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ ఏడాది మొత్తం 45 పాఠశాలల్లో 1700 మంది విద్యార్థులకు ఐదు వేల పుస్తకాలు పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మంచెం సౌజన్య, ఉపాధ్యాయులు శ్రీదేవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'చేసిన అభివృద్ధి కనిపించడం లేదా'

మొగల్తూరు: నరసాపురం నియోజకవర్గంలో జరుగుతోన్న అభివృద్ధి పనులు మాజీ ఎమ్మెల్యే బందారు మాధవనాయుడుకు కనిపించకపోవడం దురదృష్టకరమని ఏఎంసీ మాజీ చైర్మన్ కొల్లాబత్తుల రవికుమార్ అన్నారు. ఎంపీ నిధులు నరసాపురానికి రాకుండా అడ్డుకుంటున్నారంటూ మాధవనాయుడు చేసిన ఆరోపణలను నిరూపించాలని డిమాండ్ చేశారు. పుష్కరాల్లో ఎవరు ఎంత దోచుకున్నారో నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసుని అన్నారు. ప్రసాదరాజును విమర్శించే ముందు గతంలో ఎంత అభివృద్ధి జరిగిందో తెలుసుకుంటే మంచిదని హితవు పలికారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

నరసాపురం రూరల్: నరసాపురం వశిష్ట గోదావరిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. మంగళవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో గోదావరి ఒడ్డున పీచుపాలెంలోని సత్తెమ్మతాడి ప్రాంతంలో వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం.. అతని జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా ఫోన్ చేయగా భీమవరానికి చెందిన కర్రి బెనర్జీ (35)గా గుర్తించారు. 15 రోజులుగా కాళ్లలోని వైష్ణవి స్పిన్నింగ్ కంపెనీలో మెకానిక్‌గా బెనర్జీ పనిచేస్తున్నాడని, అయితే కుటుంబం గడవడం కష్టంగా ఉండటంతో దిగులుతో ఉంటున్నట్టు ఆయన భార్య దేవి తెలిపింది. ఆదివారం ఉదయం ఇంటి నుంచి పనికి వెళ్లిన బెనర్జీ గోదావరిలో తేలాడన్నారు. అప్పుల బాధతో ఆదివారం గోదావరిలో దూకి ఉంటాడని చెబుతున్నారు. దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం నిర్వహిస్తామని పోలీసులు తెలిపారు.

పవన్ వ్యాఖ్యలపై నిరసనలు

- దిష్టిబొమ్మల దహనం
- క్షమాపణ చెప్పాలని వలంటీర్ల డిమాండ్


పోడూరు: కవిటంలో వాటర్‌ట్యాంక్ సెంటర్ వద్ద దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వలంటీర్లు


పెనుగొండ: ఆచంటలో దిష్టి బొమ్మతో వలంటీర్ల నిరసన


నరసాపురం రూరల్: నరసాపురంలో వలంటీర్ల నిరసన

పెనుగొండ: వలంటీర్లపై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలకు ఆచంట నియోజకవర్గ వలంటీర్లు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం పెనుగొండ, ఆచంట, పెనుమంట్ర, పోడూరు మండలాల నుంచి వలంటీర్లు భారీగా తరలి వచ్చారు. పవన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కులమతాలకు అతీతంగా సేవలు అందిస్తోన్న తమపై వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని విమర్శించారు. అనంతరం పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పవన్ డౌన్ డైన్ అంటూ నినదించారు. అనంతరం ఆచంట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్యాకేజ్ స్టార్ తీరు దారుణం

నరసాపురం రూరల్: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. మంగళవారం నరసాపురం అంబేడ్కర్ సెంటర్లో పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. వలంటీర్లు మానవహారంగా ఏర్పడి ప్యాకేజ్ స్టార్ పవన్ కళ్యాణ్ డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పవన్ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి, చెప్పులతో కొట్టి, కాళ్లతో తన్ని నిప్పు పెట్టారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలు చేరవేస్తున్న ఘనత వలంటీర్లకే దక్కుతుందన్నారు. అటువంటి వలంటీర్లను సంఘ విద్రోహ శక్తులుగా పవన్ చిత్రీకరించడం దారుణమన్నారు. కోవిడ్ సమయంలో ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి సేవలందించారని గుర్తుచేశారు. వలంటీర్ల వ్యవస్థను ఇతర రాష్ట్రాలు సైతం మెచ్చుకుంటుంటే సంఘ విద్రోహులుగా వ్యాఖ్యానించడం పవన్ అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణంలోని వివిధ సచివాలయాలకు చెందిన వలంటీర్లు సిర్రా బాబు, కొడమంచిలి సంతోషిరాణి, బర్రి కిరణ్, యార్లగడ్డ స్వర్ణలత, చంద్రబాబు, గుంటూరు అజయ్‌బాబు, మోటూరి వేణుగోపాల్ పాల్గొన్నారు.

పవన్ దిష్టిబొమ్మల దహనం

పోడూరు: ఏలూరు సభలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చేసిన వాఖ్యలపై వలంటీర్లు భగ్గుమన్నారు. మండలంలోని జిన్నూరులో పంచాయతీ సెంటర్ వద్ద, కవిటంలో వాటర్‌ట్యాంక్ సెంటర్ వద్ద మంగళవారం పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. పవన్‌కళ్యాణ్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. అంకితభావంతో పనిచేస్తోన్న తమపై పవన్‌కళ్యాణ్ రాజకీయ లబ్ధికోసం లేనిపోని అభాండాలు మోపడం సిగ్గుచేటన్నారు. తమకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జిన్నూరులో ఎంపీపీ సబ్బితి సుమంగళిసాగర్, సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్ జమ్ము మృత్యుంజయ రావు, జేసీఎస్ కన్వీనర్ బళ్ల రాజశేఖర్, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, పార్టీ గ్రామకమిటీ అధ్యక్షుడు భూపతిరాజు సూర్యరాజు తదితరులు, కవిటంలో సొసైటీ చైర్మన్ కర్రి శ్రీనివాసరెడ్డి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబళ్ల భాస్కరరావు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యులు సత్తి మురళి కృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పడాల సత్యనారాయణరెడ్డి, పోతంశెట్టి సూర్యనారాయణరెడ్డి తదితరులు వలంటీర్లకు మద్దతు పలికారు.

వలంటీర్లకు పవన్ క్షమాపణ చెప్పాలి

ఏలూరులో జరిగిన బహిరంగ సభలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గ్రామ వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. తక్షణమే తమకు క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేస్తున్నారు. పవన్ దిష్టి బొమ్మలతో శవ యాత్రలు నిర్వహించి, దహనం చేస్తున్నారు. ప్రజలకు సేవ చేస్తోన్న తమపై లేనిపోని ఆరోపణలు చేయడం తగదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పవన్ వ్యాఖ్యలపై వలంటీర్ల ఏమన్నారంటే.. – పాలకొల్లు అర్బన్

రాజకీయాలకు పనికిరాడు



పవన్ కల్యాణ్ రాజకీయాలకు పనికి రాడు. సినిమాల్లో మహిళల సమస్యలపై పోరాటం చేసిన పవన్ కల్యాణ్ వలంటీర్లను అవమానించడం సిగ్గుచేటు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల సంతకానికి విలువ పెంచారు. ప్రజలకు సేవ చేసే క్రమంలో ఇంటింటికీ తిరుగుతున్నప్పుడు ప్రజల నుంచి మాకు ఎంతో ఆదరణ లభిస్తోంది. వలంటీర్లను కొనసాగిస్తామని హామీ ఇవ్వడానికి టీడీపీ, జనసేన పార్టీలకు ధైర్యం లేదు. వలంటీర్లకు పవన్ కల్యాణ్ క్షమాపణలు చెప్పాలి.

– డి.రోజారమణి, వలంటీరు, పాలకొల్లు

చెంప మీద కొట్టాలని ఉంది



వలంటీర్ అంటే స్వచ్ఛంద సేవకుడు. మా ఇంటి సమీపంలోనూ, చుట్టూ ఉన్న 50 కుటుంబాలతో మాకు బంధుత్వం, స్నేహ సంబంధాలు ఉంటాయి. వారి సంక్షేమం కోసమే మేము నిరంతరం పనిచేస్తుంటాం. అలాంటి మాపై సంఘ విద్రోహ శక్తులకు డేటా చేరవేస్తున్నామని మా వ్యక్తిత్వాన్ని అవమానించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు బాధాకరం. పవన్‌ను చెంప మీద కొట్టాలని ఉంది. మాకు వెంటనే క్షమాపణ చెప్పాలి.

– ముంగండ సురేఖ, వలంటీరు, పాలకొల్లు

మా మనోభావాలను దెబ్బతీశారు



దేశంలోని ఇరువురు సీఎంలను హైకోర్టు జడ్జి ప్రశంసించారు. వారిలో ఒకరు క్రేజీవాల్, మరొకరు ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ఇంటింటికీ చేరవేస్తున్న వలంటీర్ వ్యవస్థను పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయి. నిజాయితీగా పనిచేస్తున్న వలంటీర్లను జనసేన పార్టీ నేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు దారుణం. మా మనోభావాలను దెబ్బతీశారు. వలంటీర్లను రాజకీయాల్లోకి లాగి పవన్‌కళ్యాణ్ పరపతిని పోగొట్టుకున్నారు.

– పసుపులేటి రాజేశ్వరి, వలంటీరు, పాలకొల్లు

పవన్ మాట తీరు మార్చుకో



పవన్ కల్యాణ్ మాట తీరు మార్చుకోవాలి. రాజకీయాల్లో విమర్శలు సహజం. సేవాభావంతో పనిచేస్తున్న వలంటీర్లను అవమానించడం పవన్ కళ్యాణ్ అవివేకానికి నిదర్శనం. దేశం మొత్తం వలంటీర్ల వ్యవస్థను మెచ్చుకుంటోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు సేవ చేసుకునే అవకాశం కల్పించారు. జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. జీవితంలో సేవ అంటే ఏమిటో తెలియజేశారు. ఇది మా భవిష్యత్తుకు ఎంతో మేలు. మాకు పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలి.

– బాలి ఫణీంద్ర, వలంటీరు, పాలకొల్లు

జగన్ మళ్లీ సీఎం అవుతారు



నేను ఎంఏ బీఈడీ చదివా. వలంటీర్ ఉద్యోగాన్ని ఎంతో ఆదర్శవంతంగా సేవా భావంతో చేస్తున్నా. రాష్ట్రంలోని 2.40 లక్షల మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. వీరిలో 80 శాతం మహిళలే. మహిళల మనోభావాలు దెబ్బతిన్నాయి. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్, టీడీపీ అధినేత చంద్రబాబు ఒక్కటైనా మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావడం ఖాయం. ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉన్నారు. మళ్లీ జగనే రావాలని కోరుకుంటున్నారు. వలంటీర్లకు పవన్ క్షమాపణ చెప్పాలి.

– పెద్దిలక్ష్మి, వలంటీరు, పాలకొల్లు

కుటుంబ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాం



పవన్ కల్యాణ్ వలంటీర్ల మనోభావాలు దెబ్బతీశారు. మేము పింఛన్ ఇవ్వడానికి వెళ్లినప్పుడు అవ్వా, తాతలు ఎంతో మర్యాదగా రా మనవడా అంటూ ఆప్యాయంగా పిలుస్తున్నారు. కొందరైతే మావయ్య వచ్చాడని అంటుంటే మాకు ఎంతో ఆనందం కలుగుతుంది. వలంటీరు 50 కుటుంబాలతో ఓ కుటుంబ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని పనిచేస్తున్నాం.

– పొలురాజు, వలంటీరు, పాలకొల్లు

సేవలందించే ప్రక్రియే జగనన్న సురక్ష

చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు


మొగల్తూరు: ధ్రువ పత్రం అందిస్తున్న ప్రసాదరాజు


పెనుగొండ: ధ్రువ పత్రం అందిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు, రుడా చైర్మన్ షర్మిళారెడ్డి


పాలకొల్లు అర్బన్: కాపవరంలో ధ్రువపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

మొగల్తూరు: ప్రజలకు సేవలందించే ప్రక్రియే జగనన్న సురక్ష కార్యక్రమమని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మంగళవారం మండలంలోని మోడి, మొగల్తూరు 4వ సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మొగల్తూరు – మోడి గ్రామాలను కలుపుతూ దర్బరేవు వంతెన నిర్మాణ పను లు ప్రారంభం కానున్నట్టు తెలిపారు. వియర్‌ఛానల్ పనులకు టెండర్లను పిలిచామన్నారు. ఈ సందర్భంగా మొగల్తూరులో 244 కుల, 223 ఆదాయ, మోడిలో 82 కుల, 62 ఆదాయ పత్రాలను అర్హులకు అందజేశారు. సర్పంచ్‌లు పడవల మేరీ, మారల్ల మాధవి, జెడ్పీటీసీ తిరుమాని బాపూజీ, వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యులు సుధారాణి, తహసీల్దార్ జి.అనితా కుమారి, ఎంపీడీఓ వి.బాబ్జిరాజు, ఉపసర్పంచ్ బోణం నర్సింహారావు, నాయకులు కర్రి ఏసుబాబు, సంకు రాము, కడలి ఏసు, మోటుపల్లి రాంభాస్కరరావు, కుక్కల కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ

మొగల్తూరు 3వ సచివాలయం, మోడి గ్రామంలోని సచివాలయాలను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ రాం సుందర్ రెడ్డి సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం జగనన్న సురక్షలో పాల్గొన్నారు.

పేదల మేలే లక్ష్యం

పెనుగొండ: పేదల మేలు కాంక్షించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. పెనుగొండ మండలం పెనుగొండ, రామన్నపాలెం, ఆచంట మండలం ఆచంట వేమవరం, పెనుమంచిలిల్లో నిర్వహించిన జగనన్న సురక్ష సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశానికే ఆదర్శంగా ఉన్న వలంటీరు వ్యవస్థపై పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు దారుణమన్నారు. చంద్రబాబు బాటలోనే పవన్ పయనిస్తున్నారని ఆరోపించారు. రుడా చైర్మన్ మేడపాటి షర్మిళా రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే ఆదర్శ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డి నిలిచారన్నారు. ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు (పెద్ద), సర్పంచ్‌లు నక్కా శ్యామలాసోని, యర్రంశెట్టి బుజ్జి, జక్కంశెట్టి చంటి, గణేషుల శేషవేణి, ఎంపీటీసీలు నక్కా పద్మ, తాడి సుబ్బిరెడ్డి పాల్గొన్నారు.

పారదర్శక పరిపాలన

పోడూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో వలంటీరు, సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి అత్యంత పారదర్శకమైన పరిపాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. పోడూరు మండలం జగన్నాథపురం గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, సర్పంచ్ గుడాల శిరీష చంటితో కలిసి అర్హులకు ధ్రువ పత్రాలు అందజేశారు. తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు, ఏపీసీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరావు, ఎంఈఓ జి.సూర్యనారాయణ, ఈఓపీఆర్‌డీ ఎం.బలరామరాజు, ఆర్ఐ కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాలకూ సముచిత స్థానం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివర్గాల సంక్షేమానికి సముచితస్థానం కల్పిస్తున్నారని ఎంపీపీ సబ్బితి సుమంగళిసాగర్ అన్నారు. జిన్నూరు సచివాలయం–2 వద్ద గురువారం జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహించారు. ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, గ్రామసర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి చేతులమీదుగా అర్హులకు ధ్రువ పత్రాలను అందజేశారు.

సీఎం జగన్‌ను ఆశీర్వదించాలి

పాలకొల్లు అర్బన్: ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలను అందించాలనే లక్ష్యంతో పనిచేస్తోన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ కోరారు. పాలకొల్లు మండలం కాపవరం బీసీ కమ్యూనిటీ హాలు ఆవరణలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కాపవరం, వాలమర్రు గ్రామాల్లో అర్హులకు 616 వివిధ ధ్రువ పత్రాను ఎమ్మెల్సీ అందజేశారు. ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి, జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, సర్పంచ్‌లు కోలాటి రాధ, గంటా సత్యనారాయణ, ఎంపీటీసీ చింతపల్లి సాయిబాబా, తహసిల్దార్ సీహెచ్ పెద్దిరాజు, మండల పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత చిట్టూరి ఏడుకొండలు, మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, సచివాలయ కన్వీనర్ పార్శి వెంకటరత్నం, సొసైటీ అధ్యక్షుడు వేండ్ర సింహాచలం తదితరులు పాల్గొన్నారు. పాలకొల్లు 16, 17, 18, 19 వార్డుల్లో జగనన్న సురక్ష సభలు నిర్వహించారు. వినుకొండవారితోటలో రూ.34 లక్షలతో చేపట్టే సీసీ డ్రెయిన్ నిర్మాణానికి ఎమ్మెల్సీ శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, ఎంఎస్ వాసు పాల్గొన్నారు. పాలకొల్లు మండలం కొత్తపేటలో జగనన్న సురక్ష నిర్వహించారు. 415 మందికి ధ్రువ పత్రాలను ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి అందజేశారు. సర్పంచ్ కవురు భారతి, ఎంపీటీసీ వెంకటరత్నం పాల్గొన్నారు.

ఆర్యపేటలో ప్రతి ఇంటికీ తాగునీరు

యలమంచిలి: ఆర్యపేటకు జల్‌జీవన్ మిషన్ పథకంలో రూ.41 లక్షలు మంజూరయ్యాయని, త్వరలోనే ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయిలు వేస్తామని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. ఆర్యపేటలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైస్ ఎంపీపీ కొప్పాడి శ్రీనివాస్, సర్పంచ్ మేడిది విజయ జ్ఞానమణి, పార్టీ గ్రామ అధ్యక్షులు మానుకొండ సోమరాజు, ఎంపీటీసీ సభ్యురాలు మానుకొండ చిట్టెమ్మ, సచివాలయ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు, సర్పంచ్‌ల చాంబర్ మండల అధ్యక్షుడు వల్లభ సాయి వెంకట నరసింహారావు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన నాయకులు

నరసాపురం రూరల్: జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజును నరసాపురానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిలో జిల్లా ఐటీవింగ్ అధ్యక్షుడు బుడితిసుమన్ కుమార్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లాబత్తుల రవి, జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు తన్నీడి గిరి తదితరులు ఉన్నారు. పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతానికి కృషి చేయాలని శ్రీరంగనాథరాజు నాయకులకు సూచించారు.

ఎంఆర్ కిట్ల పంపిణీ

పెనుగొండ: పేద విద్యార్థులకు సీఎం జగన్ పాలన వరంగా మారిందని ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ అన్నారు. మంగళవారం కొడమంచిలి ఉన్నత పాఠశాలలో మానసిక వైకల్య విద్యార్థులకు ఎంఆర్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథక అమలును సీతారామ్ పరిశీలించారు. మెనూ పాటించాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే బండారుపై కేసు

నరసాపురం రూరల్: ట్రాఫిక్ అంతరాయం కలిగించిన మాజీ ఎమ్మెల్యే బందారు మాధవనాయుడు, మరో ఆరుగురుపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై బీఎస్‌డీఆర్ ప్రసాద్ తెలిపారు. సోమవారం భారీగా జన సమీకరణ చేసి స్థానిక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు, దూషణలు చేస్తూ ప్రజా జీవనానికి ఆటంకం కలిగించినందుకు మాధవనాయుడు, రెడ్డిం శ్రీను, గన్నవరపు శ్రీను, నల్లం మల్లిక్, చాగంటి ఆనంద్, చిటికెల రామ్మోహన్, బెజవాడ రమేష్, మరో 200 మంది కార్యకర్తలపై కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్య

నరసాపురం రూరల్: నరసాపురంలోని మొగల్తూరు రోడ్డులో గల ఓ లాడ్జిలో మంగళవారం సాయంత్రం ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతారామపురం నార్త్ గ్రామానికి చెందిన చినిమిల్లి ఆనందగోపీ ప్రసాద్ (39) చీటీలు కట్టించుకుంటూ చెరువులు చేస్తూ జీవనం సాగించే వాడు. మంగళవారం ఉదయం 8 గంటలకు పిల్లలిద్దర్నీ పట్టణంలోని ప్రైవేటు స్కూల్లో దించేందుకు ఇంటినుంచి బయలుదేరి, పిల్లలను స్కూల్లో దించిన అనంతరం అతని ఫోన్ స్విచ్‌ఆఫ్ చేశాడు. విదేశాల్లో ఉంటున్న బావమరిది ఫోన్‌కి తాను (మృతుడు) ఓ లాడ్జిలో ఉన్నట్టు మెస్సేజ్ పంపించడంతో బంధువులు అక్కడికి వచ్చి ఆరాతీయగా అతను ఉన్న రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉన్నట్టు గుర్తించారు. మృతుని సోదరుడు చినిమిల్లి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై బీఎస్‌డీఆర్ ప్రసాద్ తెలిపారు.